ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సన్మానం



భట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కంజర్ల విజయలక్ష్మి, చంద్రకాంత్ దంపతులు

అమీర్‌పేట, జూన్1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్కను ఆదివారం ప్రజాభవన్‌లో అమీర్‌పేటకు చెందిన కాంగ్రెస్ నాయకులు కంజర్ల విజయలక్ష్మి, చంద్రకాంత్ దంపతులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం పనిచేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు, సీఎం రేవంత్ రెడ్డి పనితీరుకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌పార్టీలో చేరిన కంజర్ల దంపతులను భట్టి విక్రమార్క అభినందించారు.



తేజస్వినికి నగదు బహుమతిని అందజేస్తున్న డబుల్ బెడ్‌రూం అసోసియేషన్

ఇంటర్ స్టేట్ ఫస్ట్ ర్యాంకర్‌కు నగదు పురస్కారం

ఖైరతాబాద్, జూన్1 (ఆంధ్రజ్యోతి): పేదరికంలో ఉన్నా చదువుల తల్లిగా రాణిస్తూ ఇంటర్మీడియేట్ ఒకేషనల్ (ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్)లో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించిన ఖైరతాబాద్ ఇందిరానగర్ డబుల్‌బెడ్‌రూం నివాసి తేజస్వినిని అక్కడి అసోసియేషన్ సత్కరించింది. ఆదివారం 2 బీహెచ్‌కె వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తేజస్వినిని పూలమాల, శాలువాతో సత్కరించి అధ్యక్షుడు డిబి అనిల్, ప్రతినిధులు రూ.10వేల నగదు పురస్కారాన్ని అందజేశారు. తమ టూ బీహెచ్‌కె ఇండ్లలో ఉంటూ రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకు సాధించడం గర్వకారణమని, మరికొందరు వివిధ రంగాల్లో రాణించాలని ప్రోత్సహిస్తూ తేజస్వినిని సత్కరించామని అనిల్ తెలిపారు. ఇందులో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు వెంకటేష్, యాదగిరి, ప్రతినిధులు అశోక్, సాయి, రాజేష్ తదితరులు ఉన్నారు.

బల్కంపేట ఎల్లమ్మకు ప్రత్యేక అలంకరణ



శోభాయమానంగా అలంకృతురాలైన రేణుక ఎల్లమ్మ

అమీర్‌పేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట రేణుక ఎల్లమ్మను గర్భగుడిలో ఆదివారం ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. రకరకాల పూలు సుగంధ ద్రవ్యాలతో అమ్మవారి మూల విరాట్‌లను అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.



సమావేశంలో మాట్లాడుతున్న చండి ముదిరాజ్ మత్స్యకార సంఘం అధ్యక్షురాలు కోట్ల పుష్పలత ముదిరాజ్

ముదిరాజ్‌లను బీసీ-ఏ గ్రూప్ లోకి మార్చాలి : కోట్ల

పంజాగుట్ట, జూన్1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ముదిరాజ్ సామాజిక వర్గానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని శ్రీ చండి ముదిరాజ్ మత్స్యకార సంఘం అధ్యక్షురాలు కోట్ల పుష్పలత ముదిరాజ్ డిమాండ్ చేశారు. ముదిరాజ్ లను బీసీ-డి గ్రూప్ నుంచి బీసీ-ఏ గ్రూప్ లోకి మార్చాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి నుంచి గన్ పార్క్ వరకు ఒంటరిగా చేపట్టిన పాదయాత్ర ముగింపు సందర్భంగా ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత నెల 26న యాదాద్రి నుంచి ప్రారంభించిన తన పాదయాత్ర 30న గన్ పార్క్ వద్ద ముగిసిందని తెలిపారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతులను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని, జనాభా దామాషా ప్రకారం తామెంతో తమకు అంత వాటా, చేపల చెరువుల వద్ద రక్షణ కల్పించాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు చదువుకున్న మొగిలిగిద్ద గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని, తమ సామాజిక వర్గానికి చెందిన ఒకే ఒక ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్‌కు మంత్రివర్గంలో, నీలం మధు ముదిరాజ్ కు ఎమ్మెల్సీ గా స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు.

రమణీయం.. సీతా కల్యాణ హరికథా గానం



ఐఐఎంసీ కళాశాల సభా ప్రాంగణంలో హరికథాగానం నిర్వహిస్తున్న కళాకారులు

ఖైరతాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, ఐఐఎంసీ కళాశాల, మానస ఆర్ట్స్ థియేటర్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రతీ నెల మొదటి ఆదివారం నిర్వహిస్తున్న "తెలుగు వెలుగు సమాఖ్య కార్యక్రమం" ఎనిమిదవ సమావేశం ఐఐఎంసీ కళాశాల సభా ప్రాంగణంలో జరిగింది. సభకు ఆచార్య ఫణీంద్ర అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన దూరదర్శన్ పూర్వ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ అనంతపద్మనాభరావు మాట్లాడుతూ తాను ఆకాశవాణిలో పనిచేస్తున్నప్పటి నుండి ఆకాశవాణి, దూరదర్శన్‌లో తెలుగు సాహిత్యానికి సంబంధించిన వివిధ అంశాలను ప్రసారం చేశానని తెలియజేశారు. కార్యక్రమంలో మానస ఆర్ట్స్ థియేటర్స్ సంస్థ కార్యదర్శి రఘుశ్రీ, తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు నోరి రాజేశ్వరరావు ప్రసంగించారు. కాకర్ల హనుమంతరావు ఆదిభట్ట నారాయణదాసు విరచిత "సీతా కల్యాణం" హరికథను దక్షిణామూర్తి, సుధాకర్ వాద్య సహకారంతో రమణీయంగా గానం చేశారు.

ఆకట్టుకున్న కూచిపూడి.. భరతనాట్యం



మాదాపూర్/హైటెక్ సిటీ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మాదాపూర్‌లోని శిల్పారామంలో కాలిఫోర్నియాకు చెందిన కుమారి త్యాస ముద్దన ప్రదర్శించిన భరత నాట్యంలో పుష్పాంజలి, గణేష్ వందన, రామ కౌత్వం, దేవర్ణమా, తిల్లాన వంటి అంశాలు చూపరులను ముగ్ధులను చేశాయి. ప్రముఖ కూచిపూడి నాట్య గురువులు నిర్మల్ విశ్వేశ్వరరావ్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో మూషికవాహన, పుష్పాంజలి, పలుకే బంగారమాయేనా, అదిగో అల్లదిగో, పంచాక్షరి, గీతం, కౌతం, వేడు కొందామా, చక్కని తల్లికి, తరంగం అంశాలను నిహారిక, గాయత్రి, అక్షత, మనోజ్ఞ, హాసిని, ఇషిక, నిత్య తదితరుల నృత్య ప్రదర్శన అందరినీ మెప్పించింది.



మాదాపూర్‌లోని శిల్పారామంలో నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు



శ్రీనగర్‌కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారిలో రెండు వైపుల నుంచి పొంగుతున్న డ్రైనేజీ



సనత్‌నగర్ ప్రధాన రహదారిలో పొంగిపొర్లుతున్న మురుగునీరు



బోరబండ పెద్దమ్మ నగర్ ప్రభుత్వ పాఠశాల వద్ద..

ఈ వెతలు ఎన్నాళ్లు!

- పొంగుతున్న డ్రైనేజీలు.. రోడ్లపైనే మురుగు
- ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఆటంకాలు
- దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకోని జలమండలి

అమీర్‌పేట జోన్ బృందం, జూన్1 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వర్షానికే మురుగు.. రోడ్లపై పరుగెడుతోంది. ఎటు చూసినా డ్రైనేజీ లీకేజీ దర్శనమిస్తోంది. మురుగు నీటి నుంచే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఖైరతాబాద్, సనత్‌నగర్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో డ్రైనేజీ తీవ్రతరం అవుతుంది. గత వారం కురిసిన వర్షాలకు ఎటు చూసినా డ్రైనేజీ లీకేజీలే కనిపిస్తున్నాయి. శ్రీనగర్‌కాలనీ వేంకటేశ్వరస్వామి దేవాలయం సమీపంలో ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న డ్రైనేజీ వెళ్లేందుకు సరైన మార్గాలు లేకపోవడంతో మురుగు నీరు రోడ్ల మీద పారుతూ వరద నీటి కాలువలో కలుస్తున్నాయి. ఐదేళ్లుగా ఈ సమస్యను పరిష్కరించడంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారు. సనత్‌నగర్ బస్టాండ్ సమీపంలోని ప్రధాన రహదారిలో కొద్ది రోజులుగా మురుగునీరు పొంగిపొర్లుతోంది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిలో ఉన్న డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు పొంగి రోడ్డుపై ప్రవహించడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైటెక్‌సిటీ, అయ్యప్ప సొసైటీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఏ దారి చూసినా మురుగు నీటితో నిండిపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.



ఖైరతాబాద్ న్యూ సీఐబీ క్వార్టర్స్ సమీపంలో..



ఎర్రగడ్డ బి శంకర్ లాల్ నగర్ లోని ప్రధాన రహదారిలో..



అయ్యప్ప సొసైటీలో రోడ్డుపై నిలిచిన డ్రైనేజీ నీరు

నేడు రైతులకు విత్తనాల పంపిణీ

రాజేంద్రనగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 2వ తేదీన మధ్యాహ్నం 2.30 గంటలకు రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు ఆదివారం అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ శాఖ కమిషనర్, డైరెక్టర్ డాక్టర్ బి.గోపీ, వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య హాజరై రైతులకు విత్తనాలు అందజేస్తారని పేర్కొన్నారు.

విత్తన వారోత్సవాల్లో భాగంగా..

ముందుగా ప్రకటించిన మాదిరిగా, విత్తన వారోత్సవాల్లో భాగంగా జూన్ 3వ తేదీ నుంచి వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వివిధ కేంద్రాల నుంచి రైతులకు వివిధ పంటల విత్తనాలను అందజేయడం జరుగుతోందన్నారు. వరి, కంది, మొక్కజొన్న, పెసర, మినుము, ఆముదం, చిరుధాన్యాల పంటలకు సంబంధించిన సుమారు 8,500 క్వింటాళ్ల సిద్ధంగా ఉన్నాయన్నారు. విత్తన వారోత్సవాల్లో భాగంగా సంబంధిత కేంద్రాల నుంచి జూన్ 3వతేదీ నుంచి కొనుగోలు చేయవచ్చన్నారు.

విత్తన విక్రయ, పంపిణీ కేంద్రాలు ఇవే..

- రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన స్థానంలో వరి, మొక్కజొన్న విత్తనాలు అందుబాటులో ఉంటాయని, వాటి కోసం 9440225385 నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.
- రాజేంద్రనగర్‌లోని విత్తన పరిశోధన సాంకేతిక కేంద్రంలో వరి విత్తనం అందుబాటులో ఉంటోందని, 8639975840 నెంబర్‌లో సంప్రదించి విత్తనాలు తీసుకోవచ్చన్నారు.

బుల్లెట్ ప్రూఫ్ వాహనం..
1+4 భద్రతా సిబ్బందిని వినియోగించుకోండి

రాజాసింగ్‌కు లేఖ రాసిన మంగళ్‌హాట్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని బుల్లెట్‌ప్రూఫ్ వాహనాన్ని వినియోగించాలని, ప్రభుత్వం కల్పించిన 1+4 భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు సిటీ పోలీసులు మరోమారు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళ్‌హాట్ పోలీసులు ఆదివారం లేఖ రాశారు. మే-31న శనివారం సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు మత విద్వేశాలు రెచ్చగొట్టే అవకాశాలు ఉన్న ప్రాంతాలైన తలాబ్‌కట్ట, భవానీనగర్, ఇంజన్ బౌలి, బాబానగర్, బహదూర్‌పురా, సంతోష్‌నగర్, యాకతుపురా, గోల్కొండ, జిర్రా ప్రాంతాల్లో రాజాసింగ్ ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోకుండా పర్యటించారు. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు ఇప్పటికే ఆయనకు వస్తున్న బెదిరింపులను, శత్రువులతో ఉన్న ప్రాణహానిని దృష్టిలో పెట్టుకొని రక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా మరోసారి విజ్ఞప్తి చేస్తూ లేఖ రాశారు.



వినాయక్ నగర్ అభివృద్ధి కమిటీ ప్రతినిధులను సన్మానించిన బస్తీవాసులు

వినాయక్ నగర్ అభివృద్ధికి కృషిచేస్తాం

బోరబండ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రహ్మత్ నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ లో శ్రీ వినాయక్ నగర్ వీకర్ సెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ అబ్జర్వేషన్ అండ్ డెవలప్ మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. బస్తీలో ఎన్నికల నిర్వహణ కోసం ఇంటి యజమానులంతా జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని కమిటీ ప్రతినిధులు కోరారు. బస్తీలో నెలకొన్న సమస్యలు, పెండింగ్ పనులను పరిష్కరించి కొత్తపనులు చేపట్టే అంశంపై చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో కమిటీ సలహాదారులువీరాస్వామి, ప్రేమ్‌సాగర్, అమృతరావు, పద్మరావు, అధ్యక్షుడు మాణిక్యం, ఉపాధ్యక్షులు కేశవులు, పి.శ్రీను,సయ్యద్ అలీ, ప్రధానకార్యదర్శి డానియల్, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్, ట్రెజరర్ డేవిడ్, జాయింట్ సెక్రెటరీలు లింగరాజు, అమృత్. టి.రాజు, ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులను బస్తీ ప్రజలు పూలహారాలతో సన్మానించారు.

యోగా ద్వారానే ఆరోగ్యం : నరేంద్ర బంధూజీ



బ్రహ్మ యోగ ఆశ్రమం ట్రస్ట్‌లో సభ్యత్వం తీసుకున్న ప్రతినిధులతో యోగ గురువు నరేంద్ర

బేగంపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మానవాళికి యోగా వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, ప్రతీ ఒక్కరూ యోగాను నేర్చుకోవాలని యోగా గురువు నరేంద్ర బంధూజీ అన్నారు.ఆదివారం సనత్‌నగర్‌లోని హిందూ పబ్లిక్ స్కూల్‌లో నిర్మల సాధన జ్యోతి మందిర్ ఆధ్వర్యంలో యోగ గురువు నరేంద్ర బంధూజీ పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా బ్రహ్మ యోగా ఆశ్రమ ట్రస్ట్‌ను ప్రారంభించారు. అనంతరం యోగా గురు దంపతులను శిష్యులు సన్మానించారు. నరేంద్ర బంధూజీ మాట్లాడుతూ అదిలాబాద్ లో త్వరలో పది ఎకరాల్లో బ్రహ్మ యోగా ఆశ్రమ ట్రస్ట్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. ప్రధానంగా యోగా ద్వారా ప్రతి ఒక్కరికి ఆరోగ్యం, ప్రశాంతత నెలకొనేలా చేయాలనే లక్ష్యంతో ఈ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా నిర్మల్ సాధన జ్యోతి మందిర్‌లోని టీచర్లకు బ్రహ్మ యోగా ఆశ్రమ ట్రస్ట్‌లో సభ్యత్వాన్ని ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చంద్రశేఖర్, మోతీరామ్, వేణుగోపాల్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన విస్తరణ అమల్లోకి..

- మధురానగర్ పీఎస్ పరిధిలో చేరిన మరికొన్ని ప్రాంతాలు



మధురానగర్ పోలీస్ స్టేషన్

యూసుఫ్‌గూడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నగర కమిషనరేట్ పునర్ వ్యవస్థీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంతో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధి నుండి విడిపోయి నూతనంగా ఏర్పడిన మధురానగర్ పీఎస్ పరిధిని విస్తరిస్తూ మే నెలలో ఉత్తర్వులను విడుదల చేశారు. పోలీస్ స్టేషన్ పరిధి పెంచుతూ ఇచ్చిన ఆ ఉత్తర్వులను అమలు చేయాలని పోలీస్ ఉన్నతాధికారుల నుంచి స్టేషన్ సీఐకి స్పష్టమైన ఆదేశాలు అందాయి.

నూతనంగా పెరిగిన ప్రాంతాలు

ఇప్పటి వరకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధి సెక్టార్-7లోని యూసుఫ్‌గూడ బస్తీ, లక్ష్మీనరసింహానగర్, సహోదయ కాలనీ, కమలాపురి కాలనీ, శాలివాహన నగర్, ఇందిరానగర్ గ్రీన్ బవార్చి ప్రాంతం, ప్రగతి నగర్, మారుతి నగర్, శ్రీకృష్ణ దేవరాయ నగర్, ఎస్‌బీహెచ్ కాలనీ, కృష్ణానగర్ ఏ బ్లాక్, కృష్ణానగర్ లేబర్ అడ్డా, గణపతి కాంప్లెక్స్ ప్రాంతాలు మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వచ్చాయి.

శాంతి భద్రతలకు సహకరించాలి

జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధి నుంచి విడిపోయి మధురానగర్ పీఎస్ పరిధిలోకి పెరిగిన ప్రాంతాల్లో బస్తీలతో పాటు కాలనీలు ఉన్నాయి. దీంతో రోజువారి కేసులు పెరిగే అవకాశం ఉంది. ఇక్కడ ప్రజలంతా గమనించి శాంతి భద్రతలకు సహకరించాలి. పోలీసులు నేరాలను అదుపు చేయడంలో భాగంగా నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరించాలి.

- ప్రభాకర్ సీఐ, మధురానగర్

విశ్రాంత ఎస్పీ ఇంట్లో చోరీ

అమీర్‌పేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఎస్పీ ఇంట్లోని అల్మారాలో దాచిన బంగారు మంగళసూత్రాన్ని అపహరించుకెళ్లిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. అమీర్‌పేట డివిజన్ శివబాగ్ కాలనీలో నివాసం ఉండే విశ్రాంత ఎస్పీ కె.వి.పటేల్ తల్లి కౌసల్య ఇంట్లోని అల్మారాలో 10 తులాల మంగళసూత్రాన్ని దాచుకున్నారు. గత నెల 29న అల్మారా తెరిచి చూడగా అందులోని బంగారు మంగళసూత్రం కనిపించలేదు. చోరీకి గురైందని గ్రహించి ఆదివారం ఎస్ఆర్‌నగర్ పోలీసులకు వారు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

అమీర్‌పేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): హోటల్‌లో పనిచేసేందుకు వచ్చిన అస్సాం కు చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసుల వివరాల ప్రకారం.. మదీనాగూడలో ఓ హోటల్‌లో కిచెన్ సూపర్‌వైజర్‌గా పనిచేసే ఎం.పుండరీ ఎస్ఆర్‌నగర్‌లో బహార్ కేఫ్ రీఓపెన్ అవుతుందని తెలుసుకుని వారం రోజుల క్రితం అస్సాంకు చెందిన ముగ్గురు యువకులైన బసుమిత్రి (20), పర్సింగ్ మూనూ, బసోత్రిలను సోంజిత్ అనే మీడియేటర్ ద్వారా తీసుకువచ్చి బాపునగర్‌లో రూమ్ తీసుకుని అందులో ఉంచారు. ఈ నెల 31న బసోత్రి అనే యువకుడు ముక్కు, నోట్లో నుంచి రక్తం కారుతూ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. తోటి మిత్రులు విషయాన్ని పుండరీకి తెలుపగా వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లండని సూచించాడు. 108కు సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న సిబ్బంది అతన్ని పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. కిచెన్ సూపర్ వైజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

బీజేపీ సనత్‌నగర్ డివిజన్ నూతన కమిటీ

బేగంపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సనత్‌నగర్ డివిజన్ నూతన కమిటీని ఆదివారం ప్రకటించారు. అధ్యక్షులుగా నరేష్ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా ఐలయ్య, వంశీకిశోర్, మురళీకిశోర్, సుబ్బారావు, ప్రధాన కార్యదర్శులుగా సుధాకర్ మదిరాజ్, సత్యనారాయణ, కార్యదర్శులుగా సన్నీరాజ్, మాధవి, చిన్నమ్మ, స్వప్నగుప్త, విశ్వనాథ్‌రెడ్డితో పాటు పలువురిని సభ్యులుగా నియమించినట్లు డివిజన్ అధ్యక్షుడు నరేష్ ముదిరాజ్ తెలిపారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

వెంగళరావునగర్, జూన్1 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ సంక్షేమ సమితి, జూబ్లీహిల్స్ లోని అడ్వాన్స్డ్ ఫోకస్ ఐ ఆసుపత్రి సహకారంతో ఆదివారం సమితి కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. 75 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో సమితి ముఖ్య సలహాదారు దేవిరెడ్డి నాగార్జున రెడ్డి, అధ్యక్షుడు చిలకల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పి.ఎస్.రాజు, ఉపాధ్యక్షులు ప్రసాద్, అర్జున్, కోశాధికారి సునీత, నేత్ర వైద్యులు అనూజ పాశం, అరుణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



రహ్మత్ నగర్ బాప్టిస్ట్ చర్చిలో ప్రమాణం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

రహ్మత్‌నగర్ బాప్టిస్ట్ చర్చి అధ్యక్షుడిగా బుద్ధరాజు

బోరబండ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రహ్మత్ నగర్ బాప్టిస్ట్ చర్చి అధ్యక్షుడిగా కె.బుద్ధరాజు ఎన్నికయ్యారు. చర్చిలో ఆదివారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఏసురత్నం కోశాధికారిగా రమేష్ ఎన్నికయ్యారు. బిల్డింగ్ కమిటీ, యువజన విభాగం, సండే స్కూల్, మహిళా విభాగానికి కూడా ప్రతినిధులను ఎన్నుకున్నారు.

బాలకృష్ణకు అభినందనలు

యూసుఫ్‌గూడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు ప్రతిష్ఠాత్మకమైన పద్మభూషణ్ అవార్డుకు నటవారసుడు, టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఎంపిక కావడంతో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అవ్వారు మోహన్ రావు అభినందనలు తెలిపారు. బాలకృష్ణతో తనకు 20 ఏళ్లుగా ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు.



ఇటీవల ఆత్మహత్య చేసుకున్న బోరబండ డివిజన్ బీఆర్ఎస్ మైనారిటీ నాయకుడు ఎం.డి.సర్దార్ కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించిన బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి. ఆయనతో పాటు పార్టీ నాయకులు నాగేశ్వరరావు, కిలారి మనోహర్, వెంకటేష్

- బోరబండ, ఆంధ్రజ్యోతి)



ఈటల రాజేందర్‌కు సన్మానం చేస్తున్న బీజేపీ సభ్యులు

ఎంపీ ఈటల రాజేందర్‌కు సన్మానం

తిరుమలగిరి జూన్ 1(ఆంధ్రజ్యోతి): మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యుడిగా బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తయిన సందర్భంగా కంటోన్మెంటు 8వ వార్డు రిసాలబజార్‌లో ఎంపీ ఈటల రాజేందర్‌ను ఘనంగా సన్మానించారు. బీజేపీ సీనియర్ నాయకుడు జైనపల్లి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 8వ వార్డుకు చెందిన వివిధ కుల సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో ఎంపీకి స్వాగతం పలికి, శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంటు బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లిఖార్జున్, మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గం బీజేపి కో-కన్వీనర్ జేవీ నర్సింగరావు, బీజేవైఎం జాతీయ కోశాధికారి పీఎం సాయిప్రసాద్, స్థానిక నాయకులు కిరణ్‌కుమార్ ముదిరాజ్, ధనంజయ చారి, కుల సంఘాల ప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొని ఈటలను సన్మానించారు.

ఘనంగా రేణుకదేవి కల్యాణోత్సవం



పూజలు చేస్తున్న జంపన

సికింద్రాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): బోయినపల్లి సంజీవయ్యనగర్‌లోని రేణుక దేవి కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి జరిగిన పూజలు, అమ్మవారి కల్యాణోత్సవాన్ని వీక్షించడానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అమ్మవారికి పూజలు జరిపి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో శ్రీను, అరుణ, దుర్గయ్య, వరప్రసాద్, రవి, కిరణ్, పవన్, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

డబ్ల్యూహెచ్ఆర్ఏ తెలంగాణ కార్యదర్శి నియామకం



ఎన్.నాగభూషణం రెడ్డి

మారేడుపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : వరల్డ్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ తెలంగాణ కార్యదర్శిగా ఎన్.నాగభూషణంరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం బంజారాహిల్స్‌లోని ప్రధాన కార్యాలయంలో వరల్డ్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్(డబ్ల్యూహెచ్ఆర్ఏ) తెలంగాణ రాష్ట్ర ఛైర్మన్ చెల్లా గీతారెడ్డి కంటోన్మెంట్ పికెట్ ప్రాంతానికి చెందిన ఎన్.నాభూషణంరెడ్డిని కార్యదర్శిగా నియమిస్తూ ఆమె నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం పికెట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాను చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి తనకు పదవీ బాధ్యతలు అప్పగించడం అభినందించదగ్గ విషయమని ఆయన అన్నారు. నియమించిన అసోసియేషన్ ముఖ్య ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

హెచ్ఆర్‌పీసీ సికింద్రాబాద్ జోన్ అధ్యక్షుడి నియామకం



సత్యనారాయణ

రెజిమెంటల్‌బజార్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ సికింద్రాబాద్ జోన్ అధ్యక్షుడిగా మోండా డివిజన్‌కు చెందిన ఓదెల సత్యనారాయణను ఎంపిక చేశారు. హెచ్ఆర్‌పీసీ రాష్ట్ర అధ్యక్షుడు ముదిగంటి ఎన్.శ్రీకాంత్‌రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. మానవ హక్కుల ఉల్లంఘన జరగకుండా వాటి పరిరక్షణకు కృషి చేస్తానని సత్యనారాయణ తెలిపారు.

క్రైమ్ సమాచారం

రైలు నుంచి జారి పడి వృద్ధుడు మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : కదులుతున్న రైలు నుంచి జారి పడి ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన గుండ్లపోచంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా బర్తిపూర్ ధర్మారం గ్రామానికి చెందిన బ్రహ్మానందం(65) గుండ్లపోచంపల్లిలో ఉన్న బంధువుల ఇంటికి రైలులో వెళుతున్నాడు. ఈలోగా గుండ్లపోచంపల్లి, మేడ్చల్ రైల్వేస్టేషన్ల మధ్య కదులుతున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడిపోవడంతో బలమైన గాయాలు తగిలి చనిపోయి ఉన్నాడని సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. రైల్వే పోలీసులు వృద్ధుడు కదులుతున్న రైలు నుంచి జారి పడి చనిపోయినట్లు భావిస్తున్నారు. మృతుడి జేబులో లభించిన అడ్రస్ ఆధారంగా గుండ్లపోచంపల్లిలోని బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి, పోస్టుమార్టం అనంతరం మృతుడి బంధువులకు అప్పగించారు.

యువతి అదృశ్యం



బౌద్ధనగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ మెట్టుగూడ ప్రాంతానికి చెందిన ఆదాన్ మేరీ క్యాతరిన్ కుమార్తె ఆదాన్ మేరీ ఐశ్వర్య(19) శనివారం ఇంటి నుంచి బయటికి వెళ్లిన యువతి తిరిగి రాత్రి వరకు ఇంటికి రాలేదు. యువతి సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో విషయం తెలుసుకున్న తల్లి బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో రెండు మృతదేహాలు లభ్యం



రాంగోపాల్‌పేట్, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన మహంకాళి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరశురామ్ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం సుమారు 8.30 నిమిషాల సమయంలో సురేష్‌కుమార్ గౌడ్ అనే వ్యక్తి నుంచి అందిన ఫిర్యాదు మేరకు మహంకాళి వీధిలోని శ్రీఉజ్జయిని మహంకాళి దేవాలయం పక్కన సుమారు 40-45 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే 108కు కాల్ చేయగా అంబులెన్స్ సిబ్బంది వచ్చి ఆ వ్యక్తిని పరీక్షించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి బాక్సు నంబర్ 36లో భద్రపరిచారు. మృతుడు ఎరుపురంగు చొక్కా, నలుపురంగు ట్రాక్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు, కుడి చెంపపై పుట్టుమచ్చ ఉందని తెలిపారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే మహంకాళి పోలీస్ స్టేషన్‌లో కానీ 8712660240, 8712661253 నంబర్లపై సంప్రదించాలని వారు తెలియజేశారు.

చర్లపల్లి-మౌలాలి రైల్వేస్టేషన్..



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : రైలు పట్టాల మధ్య పడి ఉన్న ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గాంధీ మార్చురీకి తరలించారు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ సింఘ్ తెలిపిన వివరాల ప్రకారం చర్లపల్లి-మౌలాలి రైల్వేస్టేషన్ మార్గమధ్యలో గుర్తుతెలియని 55 ఏళ్ల వ్యక్తి రైలు పట్టాల మధ్య చనిపోయి ఉన్న విషయాన్ని తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసలు కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ ఆటోలు యమస్పీడు గురూ!

బెంబేలెత్తిస్తున్న వారాసిగూడ టు సికింద్రాబాద్ సర్వీస్ ఆటోలు

బౌద్ధనగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వారాసిగూడ నుంచి సికింద్రాబాద్‌కు రాకపోకలు సాగించే సర్వీస్ ఆటోలు ప్రయాణికులను బెంబేలెత్తిస్తున్నాయి. కేవలం మూడు కిలోమీటర్ల దూరాన్ని కేవలం ఏడు నుంచి పది నిమిషాలలో తీసుకువెళ్లుతున్నారంటే ఎంత వేగంగా నడుపుతున్నారో అర్థం చేసుకోవచ్చు. సమయానికి బస్సులు రాకపోవటం, ఉద్యోగులు, విద్యార్థులు సమయానికి గమ్యం చేరుకోలేకపోతామన్న ఉద్దేశంతో చాలా మంది ఆటోలను ఆశ్రయిస్తుంటారు. వారాసిగూడ, శ్రీదేవి నర్సింగ్‌హోమ్, నామాలగుండు, సీతాఫల్‌మండి, చిలకలగూడ ప్రాంతాల నుంచి ప్రతిరోజు వందలాది ఆటోలు సికింద్రాబాద్ స్టేషన్ వరకు సర్వీస్ ఆటోల కింద నడుపుతారు. ఒక్కో ఆటోలో కనీసం పదిమంది ప్రయాణీకులను ఎక్కించుకుని వెళుతుంటారు. చాలా మంది ఆటోడ్రైవర్లు పోటాపోటీగా ఆటోలను ఓవర్‌టేక్ చేస్తూ వాహనాదారులు, పాదచారులను భయాభ్రాంతులకు గురి చేస్తుంటారు. ఇలాంటి సమయాల్లో ఆటోలు బోల్తా పడి ప్రయాణీకులు గాయాల పాలైన సంఘటనలూ ఉన్నాయి.



పరిమితికి మించి ఆటోలో ప్రయాణం

అంతేకాకుండా ఆటో డ్రైవర్లు గంజాయి, మద్యం సేవించటంతో పాటు గుట్కాలు, పాన్లు తిని, పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకుని మైకంలో రేసుగుర్రంలా ఆటోలు డ్రైవింగ్ చేయటంతో చాలా మంది ప్రయాణీకులు ఆందోళన చెందుతున్నారు. వీరి డ్రైవింగ్ చూసి కొంతమంది ప్రయాణీకులు మధ్యలో ఆటో దిగిపోయిన సందర్భాలున్నాయి. బస్టాప్‌లో బస్సులు కోసం ఎదురు చూసే మహిళలు, యువతలు పట్ల ఆటోడ్రైవర్లు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని గతంలో చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఆటోడ్రైవర్లు, సంఘాలతో పోలీసులు సమావేశం ఏర్పాటు చేసి మహిళలను వేధిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించిన సందర్భాలున్నాయి.



అతివేగంగా వెళుతున్న ఆటో

పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

వారాసిగూడ, సీతాఫల్‌మండి ప్రాంతాలను ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవటం లేదని ప్రయాణీకులు ఆరోపిస్తున్నారు. సికింద్రాబాద్‌కు సర్వీస్ చేసే చాలా ఆటోలకు పత్రాలు లేకపోవటంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఆటోలను నడుపుతున్నారు. చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వచ్చే ఈ ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని, ఆటోడ్రైవర్లకు ఎప్పటికప్పుడు అవగాహన సదస్సులు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

ఆగడాలను నివారించాలి



విపరీతమైన వేగంతో ఆటోలను నడుపుతున్నారు. ఆటో ల్లో ఎక్కువమంది ప్రయాణీకులను కూర్చోబెడుతున్నారని, ఇదేమని అడిగితే ముందు స్టేజీలో దిగిపోతారని చెపుతున్నారు. ట్రాఫిక్ లేకపోతే వారాసిగూడ నుంచి సికింద్రాబాద్‌కు ఏడు నిమిషాల్లోనే తీసుకెళుతున్నారు. దీంతో మరలా ఆటో ఎక్కాలనిపించదు. ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేసి ఆటోడ్రైవర్ల ఆగడాలను నివారించాలి.

- పంపర యాదగిరి, సీతాఫల్‌మండి

ఆటోల వేగాన్ని నియంత్రించాలి



వారాసిగూడ నుంచి సికింద్రాబాద్ నడిచే ఆటోల వేగాన్ని నియంత్రించాలి. వాటికి నంబర్లను కేటాయించి జాగ్రత్తగా తీసుకెళ్లేవిధంగా చర్యలు తీసుకోవాలి. నిబంధనల ప్రకారం ఎక్కువమందిని ఎక్కించుకోవద్దు. మద్యం సేవించి, గుట్కాలు తిని ఆటోలు నడిపే వారిపై చలానాలు విధించి, సీజ్ చేయాలి.

- శశిరేఖ, మెట్టుగూడ

అడ్డగుట్ట ఉద్యమాల గడ్డ

నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం



నలభై ఏళ్ల నాటి అడ్డగుట్ట



ఉద్యమంలో భాగంగా అడ్డగుట్టలో ఆందోళనలో పాల్గొన్న ఉద్యమకారులు

అడ్డగుట్ట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర పోరాటం నుంచే అడ్డగుట్టలో మొదలైంది ఉద్యమం. అడ్డగుట్ట నుంచి రెండు మూడు కిలోమీటర్ల దూరం వెళితే, ఉస్మానియా విశ్వ విద్యాలయం. విద్యార్థుల ఉద్యమం ఒక వైపు, అడ్డగుట్టలో తెలంగాణ వాదుల ఉద్యమం మరోవైపు, లాలాగూడ రైల్వేస్టేషన్‌లో రైళ్లను ఆపడం ఇంకోవైపు ఇలా అడ్డగుట్ట పోరాటాల గడ్డగా నిలిచింది. ఇక్కడ రాజకీయాలకతీతంగా నాడు పోరాటం చేశారు. అడ్డగుట్టలో పోరాటం చేసిన ఉద్యమకారులు ఒకరిద్దరు ఆత్మహత్యలు చేసుకుంటే, కొందరు అనారోగ్యంతో మృతి చెందారు. ఎస్.యాదగిరి, దాసరిశ్రీనివాస్, వసంత, సామ్‌సన్, మహ్మద్ గౌసుద్దీన్, మహ్మద్, వెంకటేష్, ప్రమీల, భాగ్య, ఇలా వందలమంది ఉద్యమకారులు అడ్డగుట్టలో కీలకపాత్ర పోషించారు.

రైల్ ఆపినందుకు పదిమందిపై కేసు

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఉద్యమంలో భాగంగా లాలాగూడ రైల్వే స్టేషన్‌లో రైల్ రోకో నిర్వహించారు. దీంతో పదిమందిపై తుకారాగేట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఉద్యమకారులైన రాజేందర్ యాదవ్ వసంత్, వై.సత్తయ్య గౌడ్, చందర్ ముదిరాజ్‌తో పాటు పలువురు జైలు పాలయ్యారు. రెండుమూడు రోజుల్లో న్యాయస్థానం బెయిల్ ఇవ్వడతో బయటికి వచ్చిన ఉద్యమకారులు జైలు అడ్డు కాదని మళ్లీ ఉద్యమ బాట పడిన చరిత్ర అడ్డగుట్టకు ఉంది.

మహ్మద్ గౌసుద్దీన్ కుటుంబాన్ని ఆదుకోవాలి



తెలంగాణ ఉద్యమంలో అడ్డగుట్ట శాస్త్రినగర్‌కు చెందిన మహ్మద్ గౌసుద్దీన్ సికింద్రాబాద్ నుంచి కీలక పాత్ర పోషించాడు అతను ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. కానీ ఈయన కుటుంబానికి ఏ ప్రభుత్వమూ ఆదుకోలేదు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుకు అత్యంత సన్నిహితుడిగా మహ్మద్ గౌసుద్దీన్ ఉన్నాడు. ఇప్పటికైనా మహ్మద్ గౌసుద్దీన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

250 గజాల స్థలం, పింఛన్ ఇవ్వాలి

అడ్డగుట్టకు చెందిన స్వామి తెలంగాణ ఉద్యమంలో ఆత్మహత్య చేసుకున్నాడు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత భార్య రేణుకకు ప్రభుత్వ ఉద్యోగం దక్కింది. ఐతే ఆ ప్రభుత్వం ఇస్తానన్న 250 గజాల స్థలం, పింఛన్ నేటికీ రాలేదు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అయినా తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ఫలాలను అందించాలి.

- స్వామి భార్య రేణుక

ప్రాణ త్యాగానికి సిద్ధపడ్డాం



తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో రాష్ట్రంలో అల్లర్లు జరుగుతున్నాయి. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణం పోయినా సరే ఉద్యమం చేయాలని అనుకున్నా. తెలంగాణ ఎవడబ్బ సొమ్ము కాదు. తెలంగాణ ప్రజలది తెలంగాణ. న్యాయం కోసం పనిచేసి, ఉద్యమకారురాలిగా పేరు తెచ్చుకున్నా. ప్రతి ఒక్కరూ తెలంగాణ ఉద్యమకారురాలిగా ఇప్పటికీ అభిమానిస్తున్నారు.

- వసంత నాయక్

ఆవిర్భావ వేడుకలకు భారీ బందోబస్తు



పరేడ్ మైదానంలో పోలీసులకు సూచనలిస్తున్న బేగంపేట్ ఏసీపీ గోపాలకృష్ణ

అడ్డగుట్ట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించే వేడుకల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని బేగంపేట్ ఏసీపీ గోపాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరేడ్ మైదానంలో వేడుకలు ఉదయం 9.30 గంటలకు మొదలై 11.30 గంటలకు పూర్తవుతాయన్నారు. పరేడ్ మైదానం చుట్టుపక్కల ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భారీ ఏర్పాట్లు చేశామన్నారు. నార్ డీసీపీ రష్మి పెరుమళ్ ఆధ్వర్యంలో దాదాపు 950 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. వీఐపీ ప్రాంతాల్లో ఒక రోజు ముందుగానే రెక్కీ నిర్వహించామని, వీఐపీ కార్లలో వచ్చే వారికి క్యూ పద్ధతిగా రూట్ మ్యాప్ సూచించామన్నారు. గ్యాలరీ వద్ద రూఫ్ టాప్స్ పెట్రోలింగ్ ఆక్టోపస్, ఆర్మీ, ముగ్గురు డీసీపీలు, 12 మంది ఏసీపీలు, 35 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, 80 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, ట్రాఫిక్ హోంగార్డులతో ప్రత్యేక నిఘా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో సీసీ కెమోరాలు ప్రత్యేకంగా బిగించి ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నామని తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేసి ఆస్పత్రి శాఖను ప్రారంభిస్తున్న హెగ్డే ఆస్పత్రి ఫౌండర్ డాక్టర్ వందన హెగ్డే

హెగ్డే ఫెర్టిలిటీ ఆస్పత్రి శాఖ ప్రారంభం

హైదరాబాద్ సిటీ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): హెగ్డే ఫెర్టిలిటీ సెంటర్ అందించే అధునాతన చికిత్సను సికింద్రాబాద్ పరిధిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కొత్త శాఖను ప్రారంభించడం ఆనందంగా ఉందని హెగ్డే ఆస్పత్రి ఫౌండర్ డాక్టర్ వందన హెగ్డే అన్నారు. సికింద్రాబాద్‌లో హెగ్డే ఆస్పత్రి 6వ శాఖను హెగ్డే ఆస్పత్రి సీఓఓ అహ్మద్ అలీషాఖాద్రీతో కలిసి ఆదివారం ప్రారంభించారు. సంతానలేమిని ఎదుర్కొంటున్న జంటలకు హెగ్డే ఆస్పత్రి అధునాతన చికిత్సలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. నగరంలో మాదాపూర్, మలక్‌పేట్, మియాపూర్, కొంపల్లి, అత్తాపూర్‌లలో ఐదు శాఖలు ఉన్నాయని, సికింద్రాబాద్ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండేందుకు కొత్తగా సికింద్రాబాద్‌లో శాఖను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఉద్యోగులు పాల్గొన్నారు.



విజయ డెయిరీ ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి తదితరులు

ఉద్యోగులు నైపుణ్యంతో పని చేయాలి

- **చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి**

తార్నాక, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : విజయ డెయిరీ అభివృద్ధికి ఉద్యోగులు మరింత కృషి చేయాలని తెలంగాణ విజయా డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం లాలాపేట్‌లోని డెయిరీ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ ఉద్యోగులతో కలిసి అంతర్జాతీయ పాల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అనంతరం డీటీఎం పెరుగు, శుభోదయం, చిన్న నెయ్యి పాకెట్లను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల ఆరోగ్యం, పాడి రైతుల శ్రేయస్సు కోసం డెయిరీ ఉద్యోగులు నైపుణ్యంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డెయిరీ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, జీఎం మల్లయ్య, కవిత, మల్లిఖార్జున్, మధుసూదన్, కృష్ణారెడ్డి, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో సీఐ రాంచందర్, డాక్టర్ బన్సీలాల్ తదితరులు

ముందస్తు వైద్య పరీక్షలతోనే ఆరోగ్యం

రెజిమెంటల్‌బజార్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): క్రమం తప్పకుండా ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల అనారోగ్యాల బారిన పడకుండా కాపాడుకోవచ్చని మార్కెట్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్ తెలిపారు. ఆదివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో బోన్ మినరల్ డెన్సిటీ(బీఎండీ), విటమిన్-డి లోపంపై ఉచిత వైద్య పరీక్షల క్యాంపును నిర్వహించారు. ఈ క్యాంపులో పోలీసులతో పాటు స్థానిక ప్రజలు పరీక్షలు చేయించుకున్నారు. క్యాంపు నిర్వాహకులు డాక్టర్ బన్సీలాల్ మాట్లాడుతూ 40 సంవత్సరాలు దాటిన వారు విధిగా బీఎండీ, విటమిన్-డి పరీక్షలు చేయించుకోవడం వల్ల ఎముకల దృఢత్వం తెలుస్తుందని అన్నారు. ఏదైనా లోపం ఉంటే వయస్సుకు తగినట్లు వ్యాయమం, టాయిలెట్‌లో కమోడ్ వాడటం, కాళ్లు మడిచి నేలపై కూర్చోకుండా చిన్న స్టూల్స్ లాంటి వాటిపై కూర్చోవడం ద్వారా ఆస్టియోఫోరోసిస్ నుండి కాపాడుకోవచ్చని తెలిపారు. సుమారు 170 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో డాక్టర్ జగదీష్, ఫిజియోథెరపిస్ట్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ. గాలి వినోద్ కుమార్ తదితరులు

సామాజిక తెలంగాణ సాధన కోసం పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్

తార్నాక, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : సామాజిక తెలంగాణ సాధన కోసం పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు దక్షిణాది జేఏసీ జాతీయ ఛైర్మన్ ప్రొ.గాలి వినోద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం తార్నాకలోని ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బీసీలకు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఒకవేళ రిజర్వేషన్ల ద్వారా రాజకీయంగా అవకాశం వచ్చినా బానిసత్వానికి అలవాటు పడ్డారని, అటువంటి వారితో ప్రజలకు ఎటువంటి మేలు జరగడం లేదన్నారు. బీసీలకు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు న్యాయం జరగాలనే లక్ష్యంతో తెలంగాణలో బహుజన సంఘాలతో కలిసి పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేసి జనాభా ధామాషా ప్రకారం అన్ని రంగాల్లో వాటా కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దక్షిణాది జేఏసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బోయ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

కంటోన్మెంట్ బోర్డు ఐదో వార్డు మహాత్మాగాంధీనగర్‌కు చెందిన కురుమ హనుమంతుకు ప్రైవేట్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.42 వేల చెక్కును తెలంగాణ ఉద్యమకారుడు పెద్దాల నర్సింహ యాదవ్ బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

- మారేడుపల్లి - ఆంధ్రజ్యోతి



ఈత పోటీలు

సికింద్రాబాద్‌లో ఆర్రియన్ స్పోర్ట్స్ అండ్ స్విమ్మింగ్ అకాడమీ రైల్వే ఆఫీసర్స్ క్లబ్ లో ఆదివారం ఈత పోటీలను నిర్వహించింది. ఈ పోటీలో 70 మంది బాలబాలికలు పాల్గొనగా బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించారు. ఈ పోటీలో ముఖ్యులు ఫిరోజ్‌ఖాన్, షేక్ వీర్‌బాబు, అబిదా బాను, ప్రముఖ సీనియర్ న్యాయవాది అన్నపూర్ణలు పాల్గొన్నారు.

- (అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి)